ప్రజాశక్తి
ఆదివారం 19 జనవరి, 2025
5
శ్రీకాకుళం



సక్రమంగా విధులు నిర్వహించాలి

ఆమదాలవలస : ప్రతిఒక్కరూ బాధ్యతతో సక్రమంగా విధులు నిర్వహించాలని పురపాలక సంఘ ఆర్‌డి వి.రవీంద్ర అన్నారు. పట్టణంలోని పురపాలక సంఘంలో శనివారం పర్యటించారు. ముందుగా పట్టణంలోని అన్న క్యాంటీన్‌ను సందర్శించి ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ పూజారి బాలాజీ ప్రసాద్‌తో కలిసి భోజనం చేశారు. ప్రతినెలా మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా పురపాలక సంఘం ఆవరణలో మొక్కలను నాటారు. అనంతరం పురపాలక సంఘ సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. పురపాలక సంఘంలో ఖాళీ స్థలాలపై పన్నులు ఎందుకు వేయలేదని సిబ్బందిని ప్రశ్నించారు. పన్నుల వసూళ్లలో కూడా సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయని, దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్‌ను ఆదేశించారు. సిబ్బంది పనితీరు మార్చుకోకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

స్వచ్ఛ సాధనకు కృషి

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- పలాస

మండలంలోని లొత్తూరు గిరిజన పంచాయతీ పరిధిలో ఉన్న గ్రామాలకు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వరాలు జల్లు కురిపించారు. శనివారం స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా గిరిజన ఆశ్రమ పాఠశాల, అంగన్వాడీ కేంద్రం, వర్మీకంపోస్టు, హెల్త్ సెంటర్ తదితర ప్రభుత్వ కార్యాలయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచడం, పారిశుధ్యం మెరుగుపపర్చడం, సమస్యలు తెలుసుకునేందుకు ప్రభుత్వం స్వచ్ఛ దివస్ చేపట్టిందన్నారు. ప్రతి నెలా మూడో శనివారం ఈ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ముందుగా ఆశ్రమ పాఠశాలను సందర్శించగా పాఠశాలలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, వసతిగృహానికి ప్రహరీ లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఉపాధి హామీ నిధులతో ఐటిడిఎ పరిధిలో తాగునీటి సమస్యతో పాటు, ప్రహరీ నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. వరహాలగెడ్డకు ప్రహరీ నిర్మించాలని, వర్మీకంపోస్టు కేంద్రానికి చుట్టూ ముళ్ల కంచెను ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కలెక్టర్‌ను కోరారు. దీనిపైనా స్పందించి నివేదికలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. తుసరాడ గిరిజన ప్రాంతంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధం అవుతుంటే, ఒడిశా ప్రాంతం నుంచి అటవీశాఖ అధికారులు అభివృద్ధి పనులను అడ్డుకుంటున్నారని గిరిజనులు తెలిపారు. అటవీశాఖ, రెవెన్యూ, ఒడిశా అధికారులతో చర్చించి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపటామని కలెక్టర్ హామీనిచ్చారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం కొనుగోలు చేయడం లేదని, ఇప్పటికే చాలా వరకు ధాన్యం బస్తాలు నిల్వ ఉన్నాయని, అమ్ముకోవడానికి అవకాశం కల్పించాలని గిరిజన రైతులు కలెక్టర్‌ను కోరారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ ఈ సమస్య రాష్ట్రవ్యాప్తంగా ఉందని, మరో మూడు రోజుల్లో దీనిపై స్పష్టత వస్తుందని తెలిపారు. లొత్తూరు కొండలపై సెల్ సిగ్నల్స్ సక్రమంగా రావడం లేదని, దీనితో చాలా ఇబ్బందులు పడుతున్నామని గిరిజనులు తెలిపారు. దీనిపై ఆర్‌డిఒ జి.వెంకటేష్, తహశీల్దార్ కళ్యాణచక్రవర్తి స్పందిస్తూ ఈ కొండలపై బిఎస్ఎన్ఎల్ టవర్లు ఏర్పాటు చేసేందుకు స్థల సేకరణ చేస్తున్నామని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. లొత్తూరు పాఠశాలలో వంటగది లేక ఇబ్బంది పడుతున్నామని వివరించారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, మండల కార్యదర్శి దువ్వాడ సంతోష్‌కుమార్, ఎపిడిఒ వసంతకుమార్, ప్రత్యేక అధికారి పోతనవల్లి చంద్రశేఖర్, ఇఒపిఆర్‌డి మెట్ట వైకుంఠరావు, ఎపిఒ శంకరరావు, ఎపిఎం జాంభవతి, కార్యదర్శి సద్గుణబాబు, సర్పంచ్ పాల్గొన్నారు.

నరసన్నపేట: స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో స్వచ్ఛ దివస్‌లో భాగంగా పారిశుధ్య పనులను ప్రారంభించారు. విలేకరుల కాలనీ వద్ద మహిళలకు తడి, పొడి చెత్తలపై అవగాహన కల్పించారు. ఖాశాగ్రంథాలయం వెనుక చెత్తా చెదారం పేరుకుపోవడంతో కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. పల్లిపేట కూడలి, ఇందిరా నగర్ కాలనీలో పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. అనంతరం అండర్ డ్రెయినేజీ వ్యవస్థను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ప్రతిజ్ఞ చేపట్టారు. ఇకపై ప్రతినెలా మూడో శనివారం ఈ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు.

గోకర్ణపురం సచివాలయ సందర్శన

మెళియాపుట్టి : మండలంలోని గోకర్ణపురం సచివాలయాన్ని కలెక్టర్ సందర్శించారు. ఈ మేరకు సిబ్బంది పనితీరును పరిశీలించారు. అలాగే గ్రామంలోని సిసి రోడ్లు, డ్రెయినేజీలను పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి ఆదేశించారు. స్థానికులు రాధాసాగరం గెడ్డ బ్రిడ్జి మంజూరు చేయాలని, డి.పట్టాలు ఇప్పించాలని విన్నవించారు. కార్యక్రమంలో తహశీల్దార్ బడే పాపారావు, ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా, సర్పంచ్ రవికుమార్ పాల్గొన్నారు.

మీలా కలెక్టర్‌నవుతా..



విద్యార్థి ఆశిష్‌తో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

మండలంలోని లొత్తూరు ఆశ్రమ పాఠశాలను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పర్యటించారు. ఇందులో భాగంగా గిరిజన విద్యార్థి సవర ఆశీష్ కుమార్ మీలా కలెక్టర్‌ను అవుతానని పరిచయం చేసుకొని సంభాషించారు. లొత్తూరుకు చెందిన సవర కళ్యాణ్, లలిత కుమారుడు సవర ఆశీష్ కుమార్ అదే గ్రామంలోని ఆశ్రమ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. పాఠశాలకు కలెక్టర్ సందర్శనకు రాగా, ఆశీష్‌కుమార్ తనకు తానుగా పరిచయం చేసుకున్నాడు. దీంతో జిల్లా కలెక్టర్ నేరుగా విద్యార్థి ఇంటికి వెళ్లి వాళ్ల తల్లిదండ్రులతో మాటామంతి జరిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆశీష్‌ను పెద్దయ్యాక ఏమవుతావని ప్రశ్నించగా, టక్కున మీలా కలెక్టర్ అవుతానని సమాధానం చెప్పాడు. కలెక్టర్ ఎందుకు కావాలనుకుంటున్నావని ప్రశ్నించారు. పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు అన్నెపు శ్రీధర్ పాత్రో పాటు ఉపాధ్యాయులు నిత్యం ప్రభుత్వం నిర్వహిస్తున్న పాఠశాలలకు సంబంధించిన వీడియో కాన్ఫరెన్స్‌లో భాగంగా మహారాష్ట్రలో విధులు నిర్వహిస్తున్న ఐపిఎస్ మనోజ్‌కుమార్ శర్మ జీవితగాథలో భాగంగా వచ్చిన 12 ఫెయిల్ అనే సినిమాను పలుమార్లు చూపించారని అన్నారు. మనోజ్‌కుమార్ శర్మను స్ఫూర్తిగా తీసుకొని అంతకన్నా పెద్ద ఉద్యోగం కలెక్టర్‌ను కావాలనే నిర్ణయం తీసుకున్నానని సూటిగా సమాధానం చెప్పారు. అనంతరం కలెక్టర్ ఆశీష్‌కుమార్‌ను అభినందించారు. అనంతరం తల్లిదండ్రులతో మాట్లాడగా, తాము జీడి పరిశ్రమలో కార్మికులుగా పనిచేస్తున్నామని చెప్పారు. మీ కుమారుడు మంచి లక్ష్యాన్ని ఎంచుకున్నాడని అన్నారు. ఆయనతో పాటు ఆర్‌డిఒ జి.వెంకటేష్, అధికారులు ఉన్నారు.



మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు

ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడాలి

- ఇది పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి విజయంతోనే సాధ్యం
- యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రజాతంత్ర హక్కులను, ఉద్యోగ, ఉపాధ్యాయ హక్కులను కాపాడుకోవడానికి, ప్రభుత్వ విద్యా రంగాన్ని పరిరక్షించుకోవడానికి ఉత్తరాంధ్ర జిల్లాల టీచర్ ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న కె.విజయగౌరిని గెలిపించుకోవాలని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు అన్నారు. నగరంలోని యుటిఎఫ్ కార్యాలయంలో ఆఫీస్ బేరర్ల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయగౌరి విజయాన్ని కాంక్షిస్తూ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ప్రస్తుతం పాఠశాల విద్యారంగం సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు వచ్చే విద్యార్థుల సంఖ్య ఏటా తగ్గుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనికి తోడు కార్పొరేట్, ప్రయివేటు రంగాల్లో పాఠశాలల సంఖ్య పెరుగుతోందన్నారు. దీనివల్ల విద్యా ప్రమాణాలు తగ్గుతున్నాయన్నారు. దీనికి తోడు గతంలో సాధించుకున్న ఉపాధ్యాయుల హక్కులను ఒక్కొక్కటి కోల్పోతున్న పరిస్థితులు ఎదురవుతున్నాయన్నారు. వాటిని పునరుద్ధరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన విద్యారంగా సంస్కరణల వల్ల ప్రాథమిక పాఠశాలల వ్యవస్థ విచ్ఛిన్నమైందన్నారు. 12 వేల పైగా ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారిపోయాయని అన్నారు. ఇక్కడ చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్య వచ్చే అవకాశం లేకుండాపోయిందన్నారు. ఉపాధ్యాయులను బోధనేతర పనులకు తిప్పి విద్యార్థులకు అన్యాయం చేస్తున్నారన్నారు. ఈ తరుణంలో ప్రభుత్వం విద్యారంగాన్ని రక్షించుకునేందుకు ఉత్తరాంధ్ర శాసన మండలి ఎమ్మెల్సీగా కోరెడ్ల విజయగౌరిని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. 2007 నుంచి పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఫోరమ్ నిరంతరం ఉద్యోగ, ఉపాధ్యాయుల పక్షాన సమస్యలపై ప్రాతినిధ్యం, పోరాటాలు చేస్తున్నారన్నారు. మొదటి ప్రాధాన్యత ఓటు వేసి ఆమెను గెలిపించాలని కోరారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు లండ బాబూరావు, ప్రధాన కార్యదర్శి బి.శ్రీరామ్మూర్తిలు మాట్లాడుతూ విజయగౌరిని గెలిపించుకోవడానికి జిల్లా ఓటర్లు సహకరించాలని కోరారు. సమావేశంలో యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు వై.వైకుంఠరావు, సహాధ్యక్షులు కె.దాలయ్య, కోశాధికారి రవికుమార్ పాల్గొన్నారు.

పరిశుభ్రతతో ఆరోగ్యం



కవిటి : చీపురుతో శుభ్రం చేస్తున్న విప్ అశోక్

ప్రజాశక్తి- కవిటి

పరిసరాల పరిశుభ్రతతో పరిశుభ్రమైన ఆరోగ్యం లభిస్తుందని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా కవిటి ప్రభుతాస్పత్రి వద్ద శనివారం పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఆస్పత్రి ఆవరణలోని పిచ్చి మొక్కలను తొలగించి మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత ప్రతిఒక్కరి బాధ్యతని, గ్రామస్థాయి నుంచి ఈ కార్యక్రమం పరిపూర్ణంగా నిర్వహిస్తే ప్రభుత్వ ఆశయమైన స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ - దివస్ పరిపూర్ణమవుతుందని అన్నారు. మండలంలోని అన్ని పంచాయతీల్లో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తహశీల్దార్ మురళీమోహన్, ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ లోల్ల రాజేష్, నాయకులు బెందాళం రమేష్, ఆరింగి మధు, బాసుదేవ్ రౌలో, భీమా రౌలో సంతోష్ పట్నాయక్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాంజీ పాల్గొన్నారు.

తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీక ఎన్‌టిఆర్



విగ్రహానికి పూలమాలలు వేస్తున్న టిడిపి నాయకులు

శ్రీకాకుళం అర్బన్ : తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీక మాజీ సిఎం నందమూరి తారక రామారావు అని టిడిపి జిల్లా అధ్యక్షులు కలమట వెంకటరమణ, ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని ఏడు రోడ్లు, సూర్యమహల్ కూడలి, 80 అడుగుల రోడ్డులోని టిడిపి జిల్లా కార్యాలయంలో ఎన్‌టిఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా ఆయన ప్రారంభించిన రూ.2లకే కిలో బియ్యం పథకం ఎంతో మేందన్నారు. ఎందరికో అనుసరణీయమైందన్నారు. ఢిల్లీ రాజకీయాల్లో గుర్తింపునకు నోచుకోక, తెలుగు జాతి ఖ్యాతి మసకబారుతున్న తరుణంలో తెలుగువారి 'ఆత్మ గౌరవం' అనే నినాదంతో ఎన్నికల బరిలో నిలిచారని గుర్తు చేశారు. అనంతరం టిడిపి కార్యాలయంలో రక్తదానం శిబిరం నిర్వహించారు. అలాగే పేదలకు పళ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శిర రమణయ్య, మాదారపు వెంకటేష్, అరవల రవీంద్ర పాల్గొన్నారు.

భారీగా బంగారు ఆభరణాలు రికవరీ

ఎస్‌పి కె.వి మహేశ్వరరెడ్డి

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలోని పలు ప్రాంతాలతో పాటు విశాఖలో దొంగతనాలకు పాల్పడిన ఇద్దరిని పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి భారీగా బంగారం స్వాధీనం చేసుకున్నారు. వారి నుంచి రూ.84.5 లక్షల విలువ గల కేజి 206 గ్రాముల బంగార ఆభరణాలను రికవరీ చేశారు. శ్రీకాకుళం నగరంలోని స్థానిక ఎస్‌పి కార్యాలయంలో ఎస్‌పి కె.వి.మహేశ్వరరెడ్డి ఇందుకు సంబంధించిన వివరాలపై శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విజయవాడకు చెందిన ఉన్నాన రాంబాబు తన అత్త ఇంటి వద్ద ఉంటూ ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు వరకు చదివాడు. క్రికెట్ ఆట ఇష్టపడే ఈయన రంజీ జట్టుకు ఎంపిక విషయంలో కోచ్ మోసం చేయడంతో తనపై తీవ్ర ప్రభావం చూపిందని నేర విచారణలో పోలీసులకు చెప్పాడు. అదే నేరాలకు పాల్పడేలా చేసిందంటూ వివరించాడు. గుంటూరు, విజయవాడ, ఎస్.కోట, రాజాం, విజయనగరం, చీపురుపల్లి, రణస్థలం, లావేరు తదితర పోలీస్‌స్టేషన్లలో 30 కేసుల్లో గతంలో అరెస్టయ్యాడు. జూన్, 2022లో అరెస్టు అయి గతేడాది జనవరి 10న విశాఖపట్నం సెంట్రల్ జైలు నుంచి విడుదలయ్యాడు. విడుదలైన తరువాత కూడా నేరాలను కొనసాగిస్తూనే ఉన్నాడు. క్రికెట్ బెట్టింగ్ కోసం కూడా చాలా డబ్బు ఖర్చు చేశాడు. మొబైల్ అప్లికేషన్లు, హార్డ్‌వేర్ తదితర సాంకేతిక పరిజ్ఞానం తెలుసుకున్నాడు. జైలులో ఉన్న సమయంలో వేరే కేసులో అరెస్టు అయిన శ్రీకాకుళం నగరం వైష్ణవు వీధికి చెందిన గిడిజాల కోటేశ్వరరావుతో స్నేహం పెంచుకున్నాడు. జైలు నుంచి విడుదలైన తర్వాత, దొంగిలించిన సొత్తుని ముత్తూట్ ఫిన్ కార్ప్, ముత్తూట్ మినీ ఫైనాన్స్ కంపెనీల్లో తాకట్టు పెట్టడానికి సొమ్ములో పది శాతం వాటాను కోటేశ్వరరావుకు ఇచ్చేవాడు. పట్టుబడిన నిందితులను కేసు దర్యాప్తులో భాగంగా విచారణ చేశామన్నారు. ఎచ్చెర్ల, లావేరు, శ్రీకాకుళం ఒకటో పట్టణం, రెండో పట్టణం, శ్రీకాకుళం రూరల్, గార, పొందూరు, పోలాకి, విశాఖపట్నం సిటీ పిఎం పాలెం పోలీస్‌స్టేషన్లో వారు నేరం చేసినట్లు అంగీకరించారు. ఆయా కేసుల్లో దొరికిన సొత్తును రికవరీ చేశారు.

తాళాలు వేసి ఉన్న ఇళ్లే లక్ష్యం

ఇంటికి తాళాలు వేసి ఉన్న ఇళ్ల వద్ద రెక్కీలు నిర్వహించడం, ఇంటి బయట వివిధ ప్రదేశాల్లో ఉంచిన తాళాలను గమనించడం చేస్తుంటాడు. ఆ తాళాలతో ఇళ్లలో ఎటువంటి వస్తువులను పాడు చేయకుండా జాగ్రత్తగా బీరువాలో దాచిన బంగారు ఆభరణాలను మాత్రమే తీసుకువెళ్లడం రాంబాబు నేర ప్రవత్తి అని ఎస్‌పి వివరించారు. దొంగతనం సందర్భంగా తాము పోగొట్టుకున్న బంగారు ఆభరణాలు దొరకడంతో బాధితులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

చాకచక్యంగా వ్యవహరించిన పోలీసులు



బంగారు ఆభరణాలను పరిశీలిస్తున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

జిల్లాలో పలుచోట్ల నమోదైన ప్రాపర్టీ కేసుల ఛేదనలో పోలీసులు చాలా చాకచక్యంగా వ్యవహరించారు. ఎస్‌పి, అదనపు ఎస్‌పి పి.శ్రీనివాసరావు, శ్రీకాకుళం డిఎస్‌పి సిహెచ్. వివేకనంద పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలుగా వ్యవహరించారు. కేసులో క్రియశీలకంగా వ్యవహరించి ఆభరణాలు స్వాధీనం, నిందితులను పట్టుకోవడంలో కీలకపాత్ర పోషించిన జె.ఆర్.పురం, శ్రీకాకుళం సర్కిల్ సిఐలు ఎం.అవతారం, పైడపునాయుడు, ఎచ్చెర్ల, లావేరు, జె.ఆర్.పురం, జి.సిగడాం ఎస్ఐలు వి.సందీప్ కుమార్, జి.లక్ష్మణరావు, ఎస్.చిరంజీవి, సిహెచ్. మధుసూదనరావును ఎస్‌పి అభినందించారు. వీరితో పాటు ఎఎస్ఐ వి.రమణ, హెడ్ కానిస్టేబుల్ ఇ.తారకేశ్వరరావు, కె.కె.సింగ్, పోలీసు కానిస్టేబుళ్లు శ్రీనివాసరావు, కె.దివాకరరరావు, కె.శేఖర్, కె.శ్రీనివాసరావు, సిహెచ్.గణేష్, ఎం.జోగారావు, ఎస్.లక్ష్మణరావు, ఎ.రమణ, డి.సూరిబాబు, టి.గొల్లారావునూ అభినందించారు.

21న జాబ్‌మేళా

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలోని నిరుద్యోగ యువతకు డిఆర్‌డిఎ, సీడాప్ సంయుక్తంగా ఈ నెల 21న జాబ్‌మేళాను నిర్వహించనున్నట్టు పీడీ కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో అపోలో ఫార్మసీ, అవంతి ఫ్రోజెన్ ఫుడ్, సినర్జీస్ కాస్టింగ్ లిమిటెడ్ సంస్థల్లో 340 ఉద్యోగ నియామకాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు తెలిపారు. నగరంలోని ప్రభుత్వ ఐటిఐ, పాతపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ జాబ్‌మేళా ఏకకాలంలో నిర్వహించనున్నామని అన్నారు. సినర్జీస్ కాస్టింగ్ లిమిటెడ్ కంపెనీ ట్రైనీ టెక్నీషియన్, ఫోర్క్ లిఫ్ట్ ఆపరేటర్ పోస్టులకు అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేయనున్నామని అన్నారు. ఈ పోస్టులకు 18- 35 ఏళ్ల మధ్య బయస్సు వారు అర్హులన్నారు. ఎంపికైన వారికి ఏడాదికి రూ.1.70 లక్షల ప్యాకేజీ చెల్లిస్తారని తెలిపారు. అలాగే అపోలో ఫార్మసీ 240 ఫార్మసిస్టులు, ఫార్మా ట్రైనర్ పోస్టులను ఫార్మసీ, ఎస్ఎస్‌సి, డిగ్రీ చదివిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.10,500 నుంచి రూ.14,000 వరకు జీతం చెల్లిస్తారన్నారు. అలాగే అవంతి ఫ్రోజెన్ ఫుడ్ కంపెనీలో ప్యాకర్స్ పోస్టులకు మహిళా అభ్యర్థులను ఎంపిక చేస్తున్నట్టు తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపికైన వారికి నెలకు గరిష్టంగా రూ.13,500 జీతం ఇవ్వనున్నట్టు వివరించారు. ఆసక్తి గల నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సంపద సృష్టి అంటే ఇదేనా బాబూ?

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

ఇల్లు ఎక్కి పాలిచ్చే గేదెను చూపిస్తానంటూ వెనకెటొకడు ఊరందరనీ ఓ ఇంటి దగ్గరకు రమ్మంటాడు. అప్పటికే మూడు, నాలుగుసార్లు ఇలాంటి బురిడీలతో జనాన్ని మోసగించడంతో ఎవరూ నమ్మలేదు. ఈ సారి ఎందుకనో అందరికీ కాన్ఫిడెన్స్ ఇచ్చాడు. దీంతో ఇల్లు ఎక్కి గేదె ఎలా పాలు ఇస్తుందో చూద్దామని అంతా చాలా ఆతృతగా ఎదురు చూడసాగారు. అందరూ చూస్తుండగా అతను ఇల్లు ఎక్కాడు. గేదెను తర్వాత ఇంటిపైకి తీసుకొస్తాడేమో అనుకున్నారు. గేదెను కిందనే ఉంచి అదిగో పాలిచ్చే గేదె అంటూ ఇంటిపై నుంచి చూపడటంలో అంతా అవాక్కయ్యారు. నాలుగో సారీ వీడి చేతిలో మోసపోయామంటూ అంతా ఊరు నుంచి వెంట బెట్టారు. ఇదొక పాత సినిమాలోని ఓ హాస్య సన్నివేశం. ఈ హాస్య సన్నివేశం చూస్తుంటే బాబు సంపద సృష్టి మాటలు అచ్చుగుద్దినట్లు కనిపిస్తున్నాయి. సంపద సృష్టిస్తాను... దానిని ప్రజలకు పంచుతాను. ఇదే తన ధ్యేయం, అంటూ తాజాగా అమరావతిలో మరో చంద్రబాబు తన స్వర్ణాంధ్ర విజన్ 2047 డాక్యుమెంట్ పత్రం విడుదల సందర్భంగా చెప్పుకొచ్చారు. సంపద సృష్టించడమంటే ఏవో ఐటి పరిశ్రమలు తీసుకొచ్చి యువతకు ఉద్యోగాలు, సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసి వ్యవసాయం అభివృద్ధి చేస్తారని వాటి ద్వారా వచ్చిన ఆదాయం అందరికీ పంచుతారని అంతా అనుకున్నారు. విద్యుత్ ఛార్జీలు, పన్నులు, మద్యం ద్వారా ఆదాయం పెంచుకుని ఖజానాకు సంపద సృష్టిస్తారని ఎవరూ ఊహించేలేదు. గతంలో ఇటువంటి ఎన్నో చూసిన జనం బాబు మాటలకు అర్థాలే వేరులే అని గుసగుసలాడుకుంటున్నారు. సంక్రాంతి పండగ రోజుల్లో మద్యం అమ్మకాల ద్వారా సర్కారు భారీగా ఆదాయం సమకూర్చుకుంది. పండగ నాలుగు రోజుల్లో కలిపి రూ.41.19 కోట్ల ఆదాయం వచ్చింది. ఈ సారి సంక్రాంతి, కనుమ రోజున మద్యం దుకాణాలకు సెలవు ప్రకటించడంతో మద్యం దొరకుతుందో లేదోనని మందుబాబులు ముందస్తు మందు ఏర్పాట్లు చేసుకున్నారు. భోగి ముందు రోజు నుంచే అమ్మకాలు విపరీతంగా పెరిగాయి. పదో తేదీన రూ.6.29 కోట్లు, 11న 6.21 కోట్లు, 12న 5.51 కోట్ల మేర అమ్మకాలు చేపట్టారు. భోగి రోజైన రూ.11.20 కోట్లు మందు గటాగటా తాగేశారు. ముక్కనుమ రోజైన 16న అత్యధికంగా రూ.11.98 కోట్ల ఆదాయం ప్రభుత్వ ఖజానాకు చేరింది. ఇదంతా జనం జేబుల్లో నుంచే వచ్చిన డబ్బే. పండగ ఖర్చులకు వెచ్చించాల్సిన సొమ్ములను మందుబాబులు ఫ్లూటుగా మద్యం తాగి ప్రభుత్వ ఖజానాను నింపారు. బాబు సంపద సృష్టించి పేదలకు ఎప్పుడు పంచుతారో తెలియదు కాని ప్రస్తుతానికి మాత్రం ప్రభుత్వ ఖజానాకు ఆదాయాన్ని సృష్టించుకుంటున్నారు.

బాబు సంపద సృష్టించి అవి తమకు పంచాలని జనం ఎవరూ కోరుకోవడం లేదు. కూలి నాలి చేసుకునే వరకు సైతం మద్యానికి బానిసై తమ కష్టార్జితాన్ని మందు తాగడానికే ఖర్చు పెడుతున్నారు. మద్యపానాన్ని నిషేధిస్తే మందు కోసం డబ్బులు వెచ్చించాల్సిన అవసరమేముస్తుంది? ఆ ఆదాయమే వారికి మిగులుతుంది. కొత్తగా వారికి సృష్టించి ఇవ్వాల్సి పనేముంది? సంపద సృష్టించడం, ప్రజలకు పంచడం నినాదం ప్రజలను మభ్యపెట్టడానికే అన్న విమర్శలూ లేకపోలేదు. టిడిపి కూటమి ప్రభుత్వానికి ఐదేళ్ల అధికారం ఇచ్చారు. రాష్ట్రానికి, జిల్లాకు ఈ ఐదేళ్లలో ఏం చేస్తారో చెప్పకుండా 2047 నాటికి అంతా స్వర్ణమయం చేస్తామంటూ చెప్పడం ప్రభుత్వం ఇచ్చిన హామీల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి చేస్తున్న ప్రయత్నంగానే అంతా చూస్తున్నారు. రాష్ట్రం అప్పులు, ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని విస్తృతంగా ప్రచారం చేసి హామీలపై ఎవరూ నోరెత్తకుండా బాబు చాకచక్యంగా వ్యవహరించారు. ఆ తర్వాత నాలుగు విడతల్లో వందలాది నామినేటెడ్ పోస్టులను భర్తీ చేయడం మనం చూశాం. గౌరవ వేతనం, ఇతర ఖర్చులతో వారి కోసం కోట్లాది రూపాయలను వెచ్చిస్తోంది. 2016-18 కాలంలో నీరు- చెట్టు పనులు చేసిన టిడిపి కార్యకర్తలు బిల్లులు చెల్లించి వారి ఆర్థిక ఇబ్బందులనూ తొలగించింది. సంక్రాంతి పండగ రెండు రోజుల ముందు రూ.10 లక్షల బిల్లులు ఉన్న 26 వేల మంది చిరు కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూరేలా రూ.586 కోట్లను విడుదల చేసింది. ఇలా ఒక్కొక్కటి కూటమి భాగ స్వామ్య పార్టీలకు, టిడిపి కార్యకర్తలకు మేలు చేసేలా ఆర్థిక అవసరాలను తీరుస్తున్న ప్రభుత్వం ప్రజల దగ్గరకొచ్చేసరికి మాత్రం బీద అరుపులు అరుస్తోంది. 2016-18 నాటి నీరు చెట్టు బిల్లులను చెల్లిస్తున్న ప్రభుత్వం మత్స్యకారులకు గతేడాది మేలో చెల్లించాల్సిన వేట నిషేధ పరిహారం డబ్బులు ఇచ్చేందుకు మాత్రం ప్రభుత్వానికి చేతులు రావడం లేదు. పైగా 2024 బ్యాన్ పిరియడ్ సొమ్ములను ఏప్రిల్ చెల్లిస్తామంటూ ప్రభుత్వం వాయిదా వేసింది మరి 2025 చేపల వేట నిషేధ కాలపు సొమ్ములను ఎప్పుడు చెల్లిస్తారు? ఒకే ఏడాదిలో రెండు సార్లు చెల్లించడం సాధ్యమేనా? ఏదో రకంగా తిరకాసు పెట్టి ఒక ఏడాది సొమ్ము ఎగ్గొట్టడానికేనన్న చర్చ మత్స్యకారుల్లో సాగుతోంది. వేట నిషేధ సొమ్ము చెల్లింపును వాయిదా వేసిన ప్రభుత్వం ఇతర హామీలనూ వచ్చే ఆర్థిక సంవత్సరానికి వాయిదా వేసినట్లుగా కనిపిస్తోంది. తల్లికి వందనం విద్యా సంవత్సరం ప్రారంభంలో, అన్నదాత సుఖీభవ ఖరీఫ్ సీజన్ సమయంలో ఇవ్వనున్నట్లుగా ఇటీవల కేబినెట్‌లో చర్చ వచ్చినట్లు తెలిసింది. ప్రజలంతా సంతృప్తిగా ఉన్నారని, మరో ఐదు శాతం పెంచాలంటూ కేబినెట్ మంత్రులతో ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించడం ద్వారా వారికి వారే సర్టిఫై చేసుకుని తృప్తి చెందుతున్నట్లుగా కనిపిస్తోంది. ఇచ్చిన హామీలు అమలు చేయనందుకా, లేక ఇంధన సర్దుబాటు ఛార్జీల పేరుతో విద్యుత్ ఛార్జీలను విపరీతంగా పెంచినందుకా ఏ రకంగా ప్రజలు సంతృప్తిగా ఉన్నారో బాబే చెప్పాలి.

పల్లెల అభివృద్ధే లక్ష్యం

ప్రజాశక్తి- ఆమదాలవలస

ప్రతి పల్లెలో ఉపాధి హామీ ద్వారా అభివృద్ధి సాధించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి తమ్మినేని శారద అధ్యక్షతన మండల పరిషత్ 2024-25 సవరణ బడ్జెట్, 2025-26 అంచనా బడ్జెట్‌ను శనివారం ప్రవేశ పెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2023 నుంచి మండల పరిషత్ బడ్జెట్ పూర్తి వివరాలు, రాబడులు, ఖర్చులు, మిగులు బడ్జెట్ తెలియజేయాలని కోరారు. పూర్తి వివరాలతో కూడిన నివేదిక అందిస్తామని ఎంపిడిఒ ఆర్.వెంకట్రావు ఎమ్మెల్యేకు తెలిపారు. జెడ్‌పిటిసి బెండి గోవిందరావు, మండల ప్రత్యేక ఆహ్వానితులు తమ్మినేని శ్రీరామ్మూర్తి, టిడిపి నాయకులు తమ్మినేని చంద్రశేఖర్, నూకరాజు, సనపల ఢిల్లీశ్వరరావు పాల్గొన్నారు.


ప్రారంభిస్తున్న విప్ అశోక్

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

కవిటి: గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. మండలంలోని సహాలాలపుట్టుగలో సిసి రోడ్డును శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో రూ.23 లక్షలతో ఏడు రోడ్లకు ఇప్పటికే ఆరు పూర్తయ్యాయని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాలకు మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా పూర్తిస్థాయి రహదారుల సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జనసేన ఇంచార్జ్ దాసరి రాజు, టిడిపి నాయకులు బెందాళం రమేష్, ఆరంగి మధు, ఎర్ర బాసుదేవ్ ప్రధాన్, రంగారౌలో, బాసుదేవ్ రౌలో, సంతోష్ పట్నాయక్, బీమారౌలో, పుల్లట సంతోష్, పుల్లట రాజు పాల్గొన్నారు.


అసంపూర్తి నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

నర్సింగ్ కాలేజ్ పనులు ప్రారంభిస్తా

శ్రీకాకుళం అర్బన్: మండలం సింగుపురంలో అసంపూర్తిగా నిర్మాణంలో ఉన్న నర్సింగ్ కాలేజ్‌ను త్వరలోనే నిర్మాణం పూర్తి చేస్తామని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. రూరల్ మండలంలోని సింగపురంలో నిర్మాణంలో ఉన్న నర్సింగ్ కళాశాలను శనివారం ఎమ్మెల్యే పరిశీలించారు. గత ప్రభుత్వంలో బకాయిలు నిలిచిపోవడం వల్లే కాంట్రాక్టర్ పనులను సగంలో నిలుపుదల చేశారన్నారు. కాంట్రాక్టర్‌తో తాను చర్చించగా రెండున్నర నుంచి మూడు కోట్ల వరకు బకాయిలు ఉన్నాయని, వాటిని చెల్లిస్తే పనులను ప్రారంభిస్తానని కాంట్రాక్టర్ వివరించాడని శంకర్ తెలిపారు. తాను రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ మంత్రితో చర్చించి పనులు మరలా ప్రారంభించేలా కాంట్రాక్టర్‌కు సూచన చేయడం జరిగిందన్నారు. 2019లో మంజూరైన కళాశాల గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల కారణంగా నిర్మాణ దశలోనే నిలిచిపోవడం బాధాకరమన్నారు. అలాగే త్వరలోనే స్టేడియం నిర్మాణాన్ని కూడా పూర్తిచేసి ప్రజలకు అందిస్తామన్నారు.

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్ అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని టిడిపి నాయకులు సూచించారు. అమృత్ భారత్ అభివృద్ధి పనుల్లో భాగంగా రైల్వే క్వార్టర్స్ రోడ్డు పనులపై పలు సందేహాలు ఉన్నాయని, ఇంజినీర్ అధికారులు దగ్గర ఉండి నాణ్యతగా పనులు నిర్వహించేలా చూడాలని టిడిపి పట్టణ అధ్యక్షుడు కాళ్ల ధర్మారావు, కార్యదర్శి నందిక జానిలు అన్నారు. ఈ మేరకు శనివారం పనులను పరిశీలించారు. పనులు పరిశీలనకు పర్యవేక్షకులు లేకపోవడాన్ని గుర్తించి వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. కార్యక్రమంలో టిడిపి నేతలు దక్కత ఢిల్లీరావు, సహదేవ్ రెడ్డి, సాలీనా ఢిల్లీ, పద్మనాభం, పి.తవిటయ్య, దిలీప్‌కుమార్, నందిగాం కోటేశ్వరరావు, లీలారాణి, కామేశ్వరరావు, పీతాంబరరెడ్డి పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ చిరస్మరణీయుడు


కవిటి : విగ్రహం వద్ద నివాళ్లర్పిస్తున్న ప్రభుత్వ విప్ అశోక్

ప్రజాశక్తి- ఆమదాలవలస

తెలుగు వారిలో చైతన్యం, గుర్తింపును తీసుకువచ్చి నలు దిశలా ఖ్యాతిని చాటి చెప్పిన వ్యక్తి నందమూరి తారక రామారావు అని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. శనివారం ఎన్‌టిఆర్ వర్ధంతి సందర్భంగా పారిశ్రామిక వాడ వద్ద నున్న ఎన్‌టిఆర్ విగ్రహానికి పూల మాలవేసి నివాళ్లర్పించారు. ముందుగా కృషి విజ్ఞాన కేంద్రాల్లో మొక్కలను నాటారు. అనంతరం రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు జాతి ఉన్నంత కాలం ఎన్‌టిఆర్ ప్రజల గుండెల్లో నిలిచిపోతారన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పేడాడ రామ్మోహనరావు, సూరపునాయుడు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్, మాజీ మున్సిపల్ చైర్మన్ తమ్మినేని గీత, మొదలవలస రమేష్, సనపల ఢిల్లేశ్వరరావు, నూక రాజు, తమ్మినేని నాని, నాగళ్ళ మురళీధర్, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కవిటి: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి నందమూరి తారక రామారావని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. ఎన్‌టిఆర్ 19వ వర్ధంతిని పురస్కరించుకుని కవిటిలోని ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో నాయకులు బెందాళం రమేష్, లోళ్ల శ్రీను, కొర్రాయి వాసుదేవ్, బాసు దేవ్ రౌలో, సంతోష్ పట్నాయక్, రంగా రౌలో, బెందాలం తిరుమల, బీమా రౌలో, బాసుదేవ్ ప్రధాన్ పాల్గొన్నారు.

మెళియాపుట్టి : వేణుగోపాలస్వామి ఆలయ ఆవరణలో ఎన్‌టిఆర్ చిత్రపటానికి గౌడ్ కార్పొరేషన్ డైరెక్టర్, మండల టిడిపి అధ్యక్షులు భాస్కర్ గౌడ, మాజీ ఎంపిపి బైరిసింగి లక్ష్మీనారాయణ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు బొచ్చు ప్రసాదరావు, మండల తెలుగు యువత అధ్యక్షులు బసవ పరమేశ్వర్‌రెడ్డి, సర్పంచ్ రవ్వల గణపతిరావు, ఎంపిటిసి ప్రతినిధులు నంబాల వెంకటరావు, చాపర మాధవరావు, అగ్గాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : బస్టాండ్ కూడలి వద్ద ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహానికి టిడిపి నాయకులు కాళ్ల ధర్మారావు, నందిక జాని, దక్కత ఢిల్లీరావు, సాలిన పద్మనాభం, సహదేవ్‌రెడ్డి, వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నరసన్నపేట : స్థానిక ఆదివారంపేట, టిడిపి కార్యాలయంలో ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహాలకు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఎంపిటిసిలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

టెక్కలి స్థానిక చిన్నబజారు కూడలి వద్ద ఎన్‌టిఆర్ విగ్రహానికి టిడిపి మండల అధ్యక్షులు బగాది శేషగిరి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మెండ దమయంతి, హనుమంతు రామకృష్ణ, ఎల్.ఎల్.నాయుడు, మట్ట సుందరమ్మ, పురుషోత్తం, మామిడి రాము, కోళ్ల లవకుమార్, పోలాకి షణ్ముఖరావు, బసవల ఆప్పలస్వామి, దల్లి ప్రసాద్‌రెడ్డి, రెయ్యి ప్రీతీష్ చంద్ పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండల పరిషత్, టిడిపి కార్యాలయాల ఆవరణలో ఉన్న, పార్కులోని ఎన్‌టిఆర్ విగ్రహాలకు టిడిపి రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరావులు, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టెక్కలి నియోజకవర్గ మహిళా అధ్యక్షులు పూజారి శైలజ, ఎఎంసి మాజీ చైర్మన్ వెలమల విజయలక్ష్మి, మండల మాజీ ఉపాధ్యక్షుడు కళ్లి నాగయ్యరెడ్డి, పట్టణ టిడిపి అధ్యక్షుడు కోరాడ గోవిందరావు పాల్గొన్నారు.

పలాస: కాశీబుగ్గ పాతబస్టాండ్ వద్ద ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహానికి ఎపిటిడిసి చైర్మన్ వజ్జ బాబూరావు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పీరుకట్ల విఠల్‌రావు, బద్ద నాగరాజు, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, మల్లా శ్రీనివాసరావు, దువ్వాడ శ్రీకాంత్, గాలి కృష్ణారావు పాల్గొన్నారు.

అండమాన్ నికోబార్ దీవుల్లో ఎన్‌టిఆర్ విగ్రహానికి టిడిపి నేషనల్ వైస్ ప్రెసిడెంట్, అండమాన్ నికోబార్ రాష్ట్ర ఇన్‌ఛార్జి మాధవనాయుడు, అండమాన్ నికోబార్ రాష్ట్ర అధ్యక్షులు మాణిక్యరావు, టిడిపి కౌన్సిలర్ సాహిల్ అమిత్ సెల్వి, రాష్ట్ర సెక్రటరీ బి.కాంతారావు, రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ బాల్జీ, డి.జె.ప్రసాద్, సత్యనారాయణ, దుష్యంతలు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

కొత్తూరు : నివగాం రోడ్డులోని ఎన్‌టిఆర్ విగ్రహానికి మాజీ వైస్ ఎంపిపి ఆగతముడి మాధవరావు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో కార్యక్రమంలో మాతల గా.డీ, సర్పంచ్ ప్రతినిధి మజ్జి వెంకటరావు పాల్గొన్నారు.

లావేరు: ఎన్‌టిఆర్ ఆశయసాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని టిడిపి మండల అధ్యక్షులు ముప్పిడి సురేష్ అన్నారు. ఎన్‌టిఆర్ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలో ఎన్‌టిఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. అనంతరం వృద్ధులు, రోగులకు పండ్లు, రొట్టెలు, స్వీట్లు, దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఎంసి మాజీ చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, టిడిపి నాయకులు లంకలపల్లి శ్రీనువాసరావు, మాజీ జెడ్‌పిటిసి ఎన్.త్రినాధ్, దారపురెడ్డి కూర్మారావు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలో తాళ్లవలసలో టిడిపి రాష్ట్ర మహిళా కార్యదర్శి ముప్పిడి సుజాత ఎన్‌టిఆర్ చిత్రపటానికి మహిళలతో కలిసి నివాళ్లర్పించారు.


ఆమదాలవలస : రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్


రణస్థలం రూరల్: ఎన్‌టిఆర్‌కు నివాళ్లర్పిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

రణస్థలం రూరల్: మాజీ సిఎం నందమూరి తారక రామారావు వర్ధంతిని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో లెంక శ్యాం, డిజిపం ఆనందరావు, పిసిని జగన్నాధం నాయుడు, ముప్పిడి సురేష్ కుమార్, బెండి మల్లేసు, గొర్లె సాయి, మండల రాము నాయుడు, లెంక అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : పట్టణంలోని అరసవల్లిలో మాజీ మంత్రి గుండ అప్పల సూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి స్వగృహంలో ఎన్‌టిఆర్ వర్ధంతి పురస్కరించుకుని ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఆయన రాజకీయ ప్రస్థానం ఒక చారిత్రాత్మక ఘట్టమని, తెలుగువారి ఆత్మ గౌరవం పెంచే మహోన్నత వ్యక్తని కొనియాడారు.

తాగునీటి సరఫరా పరిశీలన

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని 20 వార్డు సూదికొండ, రెల్లివీధిలో తాగునీటి సమస్య ఎక్కువగా ఉండడంతో ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ఈ నీటి సరఫరాను కమిషనర్ ఎన్.రామారావు శనివారం పరిశీలించారు. ఎమ్మెల్యే గౌతు శిరీష, చైర్మన్ బల్ల గిరిబాబు సహకారంతో బోరు నిర్మించి తాగునీటి సరఫరాకు కృషి చేస్తామన్నారు. ఆయనతో పాటు ఎఇ ఉన్నారు.



పరిశీలిస్తున్న కమిషనర్ రామారావు


ఆర్థికసాయం అందజేస్తున్న ఉద్యోగులు

ఉద్యోగుల ఆర్థికసాయం

ప్రజాశక్తి- సోంపేట

సోంపేట మండలం గొల్లగండి సచివాలయంలో సంక్షేమ, విద్యా సహాయకునిగా పనిచేస్తున్న రట్టి జయరాం గతేడాది సంభవించిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. మృతుని కుటుంబానికి జిల్లాలోని సహోద్యోగ సంక్షేమ సహాయకులు కలిసి రూ.2.2 లక్షలు ఆర్థికసాయం శనివారం అందజేశారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షులు ఈగల తిరుపతిరావు మాట్లాడుతూ బాధిత కుటుంబానికి తోటి ఉద్యోగులంతా బాసటగా నిలవడం సంతోషదాయకమని అన్నారు. మృతుడి భార్య శోభారాణికి కారుణ్య నియామకానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ యువరాజ్, గౌరవాధ్యక్షులు రమేష్, పాపారావు, కిషోర్, వాసు, రంగారావు, వసంత్ కుమార్, మోహన్, భాస్కర్, జోగారావు, చైతన్య, చిరంజీవి, శ్రీను, రాజేష్ పాల్గొన్నారు.

గోతులు పూడ్చేదెప్పుడు?

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

గతేడాది నవంబరు 30న వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు బోరుభద్ర నుంచి కె.లింగూడు వరకు రోడ్డు మరమ్మత్తులకు రూ. 70 లక్షల నిధులతో శంకుస్థాపన చేశారు. ఆ సందర్భంగా మాట్లాడుతూ సంక్రాంతి నాటికి ఎక్కడా గోతు కనిపించినా సంబంధిత కాంట్రాక్టరుపై, అధికారులపై చర్యలు తీసుకుంటామని బహిరంగ సమావేశంలో హెచ్చరించారు. అయినా సంక్రాంతి దాటిని గోతులను పూడ్చలేదు. మంత్రి మాటలకు విరుద్ధంగా ఈ రోడ్డు మరమ్మతులు చేపడుతున్నారని వాహన చోదకులు, తీర ప్రాంత ప్రజలు విమర్శిస్తున్నారు. బోరుభద్ర నుంచి వివేకానంద పాఠశాల వరకు మరమ్మతులు చేపట్టారు. అలాగే కె.లింగూడు నుంచి కొల్లిపాడు వరకు మాత్రమే మరమ్మతులు చేపట్టారు. మధ్యలో కొల్లిపాడు నుంచి వివేకానంద పాఠశాల వరకు వదిలేశారు. దీంతో గోతులమయంతో ఉన్న రోడ్డు వల్ల వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే రహదారి పెద్ద పెద్ద గోతులు ఉండడంతో తీర ప్రాంత ప్రజలు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టి గోతులు పూడ్చాలని తీర ప్రాంత ప్రజలు ప్రయాణికులు కోరుతున్నారు.


కొల్లిపాడు చెరువు వద్ద ఏర్పడిన గోతులు


నివాళ్లర్పిస్తున్న ఎమ్మెల్యే

జనసేన నాయకులు కాంతిశ్రీ మృతి

శ్రీకాకుళం అర్బన్ : ఎచ్చెర్ల నియోజకవర్గానికి చెందిన జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి విశ్వక్సేన్ తల్లి, సీనియర్ నాయకురాలు కాంతిశ్రీ శనివారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందారు. గత కొంత కాలంగా ఆనారోగ్యంతో బాధపడుతున్న ఆమె ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆమె మృతి వార్తను తెలుసుకున్న శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ నగరంలోని తోటపాలెం రోడ్డులో ఉన్న ఆమె నివాసానికి చేరుకుని పార్థివదేహం వద్ద పూలమాల వేసి నివాళ్లర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు.


కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న లక్ష్మీదేవి

వి.జి.కె మూర్తి కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సిపిఎం సీనియర్ నాయకులు వి.జి.కె మూర్తి కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి శనివారం పరామర్శించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నిష్కలంక మనస్తత్వం ఉన్న వ్యక్తి మూర్తి అని కొనియాడారు. గతంలో అనేకమార్లు ప్రజా సమస్యలపై జరిపిన పోరాటాల్లో ఆయనతో కలిసి నడిచానని గుర్తు చేసుకున్నారు. ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు.

ప్రశాంతంగా నవోదయ పరీక్షలు

ప్రజాశక్తి- రణస్థలం

జవహర్ నవోదయలో ఆరోతరగతి ప్రవేశానికి శనివారం నిర్వహించే పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. సరుబుజ్జిలి మండలం వెన్నెలవలసలోని నవోదయ పాఠశాలలో ఆరో తరగతిలో చేరేందుకు 80 సీట్లు ఉన్నాయి. వీటికి సంబంధించి రణస్థలం మండలం కొండములగాం ఆదర్శ పాఠశాలలో, జె.ఆర్.పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కేంద్రాల్లో ప్రవేశ పరీక్షలు నిర్వహించగా ఆదర్శ పాఠశాలలో 264 మందికిగాను 43 మంది గైర్హాజరు కాగా, జె.ఆర్.పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కేంద్రంలో 234 మందికిగాను 31 మంది గైర్హాజరయ్యారు. ఈ పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ఎంఇఒ-2 బి.లావణ్య పర్యవేక్షణలో నిర్వహించారు.


రణస్థలం : నవోదయ పరీక్షలను పరిశీలిస్తున్న ఎంఇఒ లావణ్య

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురంలో ఏర్పాటు చేసిన మూడు కేంద్రాల్లో నిర్వహించిన నవోదయ ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా ముగిసింది. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 288 మందికి 256 మంది హాజరయ్యారు. కబీరుదాస్, ఎన్.విశ్వనాథ్ పర్యవేక్షణ చేశారు. బాలికల ఉన్నత పాఠశాలలో 196 మందికి 168 మంది హాజరయ్యారు. స్వర్ణభారతి విద్యా సంస్థలో 360 మందికి, 219 హాజరయ్యారు.

పలాస : పలాసలో మూడు కేంద్రాల్లో నిర్వహించిన నవోదయ ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా ముగిసింది. కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఎన్ఎఫ్ఎన్ స్కూళ్లల్లో ఈ పరీక్షలు నిర్వహించారు. కాశీబుగ్గ జిల్లా పరిషత్ పాఠశాలలో 240 మంది, పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 288, ఎన్ఎఫ్ఎన్ స్కూల్‌లో 161 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, కాశీబుగ్గ హైస్కూల్‌లో 27 మంది, పలాస ఉన్నత పాఠశాలలో 16 మంది, ఎన్ఎఫ్ఎస్ పాఠశాలలో 17 మంది హాజరుకాలేదని ఎంఇఒలు తెలిపారు. పరీక్షా కేంద్రాలను ఎంఇఒ-2 సత్యం, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చిన్నంనాయుడు పరిశీలించారు.

కోటబొమ్మాళి: స్థానిక జిల్లా పరిషత్ బాలుర, బాలికల పాఠశాలలో జరిగిన నవోదయ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో 288 మంది, జిల్లా పరిషత్ బాలిక పాఠశాలలో 199 మంది మొత్తం 487 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 455 మంది హాజరయ్యారు. ఎంఇఒ ఎల్.వి.ప్రతాప్ పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. బాలుర పాఠశాలకు పరీక్ష చీఫ్‌గా డి.గోవిందరావు, సిఎల్‌ఒగా టి. ఆదినారాయణ, బాలికల పాఠశాల పరీక్షా కేంద్రం చీఫ్‌గా రమాదేవి, సిఎల్‌ఒగా బి.ఖజేశ్వరరావులు వ్యవహరించారు.

మందస: మందస జిల్లా పరిషత్ నవోదయ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. 468 మంది పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా, 33 మంది గైర్హాజరయ్యారు. ఎంఇఒలు లక్ష్మణరావు, భాస్కరరావు పర్యవేక్షించారు.


నాటిక ప్రదర్శనకు బయలుదేరిన నటీనటులు

నేడు 'పులి కాలం' నాటిక ప్రదర్శన

ఆమదాలవలస: పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని ఖరగ్‌పూర్‌లో ప్రవాసాంధ్ర నవ్య కళాపరిషత్ నిర్వహిస్తున్న జాతీయస్థాయి నాటికల పోటీల్లో ప్రదర్శనకు కుప్పిలి వెంకటరాజారావు రచించిన 'పులి కాలం' నాటిక ప్రదర్శనకు ఎంపికైంది. ఈ నెల 19న శ్రీ వేంకటేశ్వర కళామండలి కళాకారులు కె.రామారావు, కె. శ్యామల రావు, ఎం.విశ్వంత్, కె.వి.రాజారావు, ఎస్.దీపిక పోటీలో ప్రదర్శన ఇవ్వనున్నట్లు ఖరగ్‌పూర్ కళా పరిషత్ నిర్వాహకులు సమాచారం పంపినట్లు దర్శకుడు కె.వి.రాజారావు తెలిపారు. కోల్‌కతాలో మెడికోపై జరిగిన అత్యాచారం కథాంశంతో ఈ నాటిక రచించబడింది.



నేత్రాలను పరీక్షిస్తున్న వైద్యాధికారి గ్రేసీ

ఆటోడ్రైవర్లకు నేత్ర వైద్య పరీక్షలు

సోంపేట: రహదారి భద్రతపై అవగాహనా కార్యక్రమంలో భాగంగా శనివారం సోంపేటలోని ఆరోగ్యవరం నేత్ర ఆస్పత్రిలో ఎస్ఐ లవరాజు ఆధ్వర్యాన ఆటో డ్రైవర్లకు శనివారం నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ డ్రైవర్లు ఆటో నడుపునప్పుడు కళ్ల సమస్యలు ఉంటే రోడ్డు ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉన్నాయని అన్నారు. అందుకు ఆటో డ్రైవర్లకు నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఆరోగ్యవరం ఐ ఆస్పత్రి వైద్యాధికారి బి.గ్రేసీ, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రథమ చికిత్సతో ప్రాణాలకు రక్ష

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రమాద సమయాల్లో సకాలంలో ప్రథమచికిత్స అందించడం ద్వారా ప్రాణాలు కాపాడవచ్చని, ఆదిశగా యువత ఆలోచించాలని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు అన్నారు. రెడ్‌క్రాస్ కార్యాలయంలో ఎనిమిది రోజుల పాటు నిర్వహించిన సీనియర్ ప్రొఫెషనల్ ఫస్ట్ ఎయిడ్ ట్రైనింగ్ ముగింపు కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ శిక్షణలో 30 మంది పాల్గొన్నారు. ప్రోగ్రాం మేనేజర్‌గా డాక్టర్ శ్రీకాంత్, గొలివి రమణ, కె.సత్యనారాయణ వ్యవహరించారు. సిపిఆర్‌పై అవగాహన, విపత్తుల సమయాల్లో గాయాలకు కట్లుకట్టుట, పాముకాటు, తేలుకాటు, 'గుండెపోటు వచ్చిన వారికి ప్రథమ చికిత్స, కరెంట్ షాకు తగిలిన వారికి చికిత్స, రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి ప్రథమ చికిత్స అత్యవసరమన్నారు. శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లును అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సెక్రటరీ బలివాడ మల్లేశ్వరరావు, ఎఒ నర్సింగరావు, మేనేజర్ గుణకరరావు, ఎం. కళ్యాణ్ చక్రవర్తి, కళ్యాణ్, పి.చైతన్య కుమార్ తదితరులు పాల్గొన్నారు.


ధ్రువపత్రాలను అందజేస్తున్న జగన్మోహనరావు

ఉద్యానవనం...కళాహీనం



- అధ్వానంగా మారిన నెహ్రూ పార్కు
- పట్టణ ప్రజలకు కనుమరుగైన ఆహ్లాదం

ప్రజాశక్తి- పొందూరు

ఉరుకులు... పరుగులే మానవ జీవన శైలిగా మారిన ప్రస్తుత తరుణంలో కాస్తంత సేద తీరేందుకు పార్కులు ఎంతగానో దోహద పడతాయి. పగలంతా కష్టపడి, అలసి, సొలసి సాయంత్రం వేళ కాస్తా ఆహ్లాదం కోసం పార్కుకు వెళ్లాలని అనిపిస్తుంది. కానీ, మేజర్ పంచాయతీ పొందూరు పట్టణ ప్రజలకు దశాబ్దాలుగా ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించిన నెహ్రూ పార్కు కళాహీనంగా మారి అధ్వానంగా తయారైంది. దీంతో పార్కు అభివృద్ధికి కృషి చేయాలంటూ పాలకులకు, అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకుంటాన్నా పట్టించుకునే నాథుడే లేడంటూ పట్టణ వాసులు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలోని మేజర్ పంచాయతీల్లో పొందూరు ఒకటి. సుమారు 4 వేలు గృహాలు, 16 వేలు జనాభా ఉన్న ఈ పట్టణానికి కనీసం ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించే ందుకు అన్ని సదుపాయాలతో కలిగిన పార్కు లేకుండా పోయింది. ప్రపంచ వ్యాప్తంగా ఖాధీ వస్త్రాల పేరు చెబితే గుర్తుకు వచ్చేది పొందూరని, అలాంటి పట్టణ ప్రజలకు ఆహ్లాదం కరువైందంటూ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు.


పొందూరులో నెహ్రూ పార్కు

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా

పట్టణంలో 1964లో అప్పటి సర్పంచ్ పాలిశెట్టి సూర్యం ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించాలనే ఉద్దేశంతో నెహ్రూ పార్కు నిర్మాణం చేపట్టారు. ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించిన ఈ పార్కు ప్రస్తుతం అధ్వానంగా, కళాహీనంగా తయారై అసాంఘిక కార్య కళాపాలకు అడ్డాగా మారింది. చీకటి పడిందంటే చాలు అసాంఘిక కార్యకళాపాలు ప్రారంభమవుతున్నాయి. సమీపంలో మద్యం దుకాణాలు ఉండడంతో మందుబాబులకు ఆశ్రయంగా మారింది. దీంతో పార్కులో పిచ్చిమొక్కలతో పాటు మందు సీసాలు ఎక్కడ పడితే అక్కడే దర్శనమిస్తుంటాయి. మారుతున్న కాలానుగుణంగా పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడు తున్న పాలకులు, అధికారులు పార్కుల నిర్మాణంపై మాత్రం దృష్టి సారించడం లేదు. సాయంత్రం వేళ విశ్రాంత ఉద్యోగులు, వృద్ధులు, మహిళలు, చిన్నారులు ఆడుకు నేందుకు, కాలకృత్యాలు తీర్చుకునేందుకు అనువుగా పార్కు నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఉంది. సుమారు 16 వేలు జనాభా ఉన్న పట్టణానికి కనీసం ఒక్క పార్కు కూడా లేకపోవడం దారుణమంటూ ప్రజలు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు.

హామీలతో సరిపెడుతున్నారు...

పొందూరులో ఎలాంటి సమావేశాన్ని నిర్వహించాలన్నా నెహ్రూ పార్కులోనే చేపడుతుంటారు. ఆ సమయంలో నెహ్రూ పార్కు దుస్థితిని చూసిన పాలకులు పార్కు అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామంటూ హామీలు ఇస్తున్నారే తప్ప ఆచరణలో మాత్రం కానరావడం లేదంటూ పట్టణ వాసులు వాపోతున్నారు. గతంలో సుమారు రూ.10 లక్షలు ఎంపీ నిధులతో పార్కు అభివృద్ధి చేయనున్నట్లు ప్రస్తుత కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ప్రకటించారు. అయినా ఆచరణకు నోచుకోలేదంటూ పలువురు పేర్కొంటున్నారు. దీనిపై రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే కూన రవికుమార్‌లు దృష్టిని సారించి పార్కు అభివృద్ధికి చొరవ చూపాలంటూ పట్టణ వాసులు కోరుతున్నారు.

పార్కును అభివృద్ధి చేయాలి



ఆరు దశాబ్దాలు చరిత్ర కలిగిన నెహ్రూ పార్కు పట్టణ వాసులకు ఎంతో ఆహ్లాదకరంగా ఉండేది. ప్రస్తుతం అసాంఘిక కార్యకళాపాలకు అడ్డాగామారి అధ్వానంగా తయారైంది. సాయంత్రం వేళ విశ్రాంతి ఉద్యోగులకు, చిన్నారులకు ఆహ్లాదం పంచేందుకు దీనిని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. పార్క్ అభివృద్ధికి పాలకులు, అధికారులు హామీలు గుప్పిస్తున్నారే తప్ప ఆచరణలోకి రావడం లేదు. కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టిని సారించి పార్కును అభివృద్ధి చేయాలి.

- కాళ్లకూరి శాంతారాం, యంగ్‌స్టార్ యూత్‌క్లబ్ అధ్యక్షులు

రోడ్డు ప్రమాదంలో ఆర్మీ జవాన్ మృతి

- శోకసంద్రంలో తల్లిదండ్రులు
- ఉంగరాడ మెట్ట, దన్నానపేటలో విషాదం

ప్రజాశక్తి- బూర్జ

పాలకొండ - శ్రీకాకుళం ప్రధాన రహదారిపై శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆర్మీ జవాన్ మృతి చెందాడు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. విజయనగరం జిల్లా రేగిడి మండలం ఉంగరాడమెట్టకు చెందిన ఆర్మీ జవాన్ గొర్లె దుష్యంత్ (చిన్ని) (26) శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస మండలం దన్నన్నపేట వెళ్తుండగా మార్గమధ్యలో ఉప్పినివలస - అక్కులపేట గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు తల్లిదండ్రులు ఉంగరామెట్టలో స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్నారు. అయితే సంక్రాంతి రోజులు కావడంతో సొంతూరు దన్నానపేట వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది.

స్నేహితులను కలిసి వెళ్తుండగా...

దుష్యంత్ పాలకొండ పట్టణంలోని ఒక ప్రైవేటు విద్యాసంస్థల్లో విద్యనభ్యసించాడు. స్నేహితులు శుక్రవారం పాలకొండలో పూర్వపు విద్యార్థుల సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న చిన్ని అందరితో పాటు ఆనందంగా గడిపి తాతగారిళ్లు దన్నానపేట బయలుదేరి వెళ్లిన సందర్భాన ఈ ప్రమాదం జరిగినట్టు తెలుస్తోంది.

అందివచ్చిన కొడుకు అనంత లోకాలకు....

అంది వచ్చిన కొడుకు అనంత లోకాలకు వెళ్లిపోవడంతో దుష్యంత్ తల్లిదండ్రులు గొర్లె జగన్నాధరావు, రమాదేవిలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కొడుకు ఆర్మీలో చేరి దేశ రక్షణకు, తమ కుటుంబానికి అండగా వున్న తమ కుమారుడు ప్రమాదంతో మృతి చెందడం వారిని తీవ్రంగా కలిచివేసింది. దుష్యంత్ మరణవార్త తెలిసిన వెంటనే ఉంగరాడమెట్ట, దన్నానపేట గ్రామాల్లో విషాదఛాయలు అలముకున్నాయి.


ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు (ఇన్‌సెట్‌లో దుష్యంత్ ఫైల్)

టిడిపి నాయకునిపై దాడి

నందిగాం : మండలంలోని ఆనందపురం పంచాయతీ సవరబాణాపురానికి చెందిన టిడిపి నాయకుడు పైల బాబూరావుపై అదే గ్రామానికి చెందిన కె.సూర్యనారాయణ శుక్రవారం దాడి చేశారని ఎస్ఐ షేక్ మహ్మద్ ఆలీ శనివారం తెలిపారు. వ్యక్తిగత కారణాల రీత్యా దాడి చేసినట్లు ఫిర్యాదు రావడంతో కేసు దర్యాప్తు చేస్తున్నామని అన్నారు.


చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్

సిఎం సహాయనిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నియోజకవర్గం పరిధిలోని గార మండల కేంద్రానికి చెందిన ఎన్ని శ్రీనివాసరావుకు శనివారం సిఎం సహాయనిధి వచ్చిన రూ.92 వేలు చెక్కును ఎమ్మెల్యే గొండు శంకర్ శ్రీనివాసరావుకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతో మానవత్వం కలిగిన వ్యక్తి అని సమస్య చెప్పిన వెంటనే స్పందించి బాధిత కుటుంబానికి ఆదుకోవడం ఆనందంగా ఉందన్నారు.


వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న కృష్ణమూర్తి

వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వాతావరణంలో వచ్చిన మార్పుల వలన చలితీవ్రత అధికమైందని, దీనివల్ల వృద్ధులు, ఆస్తమా వంటి రోగగ్రస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని డిసిసి అధ్యక్షులు అంబటి కృష్ణారావు అన్నారు. శనివారం గార మండలం అంబటివానిపేటలో జెమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యాన ప్రత్యేక వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ శిబిరంలో పాల్గొన్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో గార మండల కాంగ్రెస్ అధ్యక్షులు అంబటి దాలినాయుడు, తదితరులు పాల్గొన్నారు.


పరామర్శిస్తున్న నాయకులు

నాయకుల పరామర్శ

వజ్రపుకొత్తూరు: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మాజీ ఎంపిపి హనుమంతు రామారావు కుటుంబ సభ్యులను పలువురు నాయకులు శనివారం పరామర్శించారు. మండలంలోని బెండిలోని ఆయన స్వగృహంలో రామారావు చిత్రపటానికి సిపిఎం, వైసిపి నాయకులు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కుటుంబానికి కలసి ఓదార్చి సానుభూతి తెలిపారు. పరామర్శించిన వారిలో సిపిఎం నాయకులు బమ్మిడి ఆనందరావు, నెయ్యల మోహనరావు, చంద్రయ్య జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రతినిధి పాలిన శ్రీనివాసరావు, ఎంపిపి ప్రతినిధి ఉదయ్ కుమార్, ఉద్దానం గోపీనాథపురం సర్పంచ్ కె.శ్రీను, చినవంక మాజీ సర్పంచ్ సాన కృష్ణారావు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

సరుబుజ్జిలి: మండలంలోని కొత్తకోట సమీపంలో శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో సన్నబోయిన చంద్రశేఖర్ (25) అనే యువకుడు మృతి చెందినట్లు ఎస్ఐ బి. హైమావతి తెలిపారు. దుబాయ్‌లో వెల్డింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న మృతుడు సంక్రాంతికి తన స్వగ్రామమైన హిరమండలం మండలం కొండరాగోలు వచ్చాడని, ఆమదాలవలసలో ఉన్న తన స్నేహితుడిని కలవడానికి శనివారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఆమదాలవలస నుంచి సరుబుజ్జిలి వైపు వస్తున్న మరో ద్విచక్ర వాహనం ఎదురెదురుగా ఢీకొనడంతో చంద్రశేఖర్ సంఘటనా స్థలంలోనే మృతి చెందడం జరిగిందన్నారు. మృతుని తండ్రి తిరుపతిరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని శ్రీకాకుళం సర్వజన ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదాం


శ్రీకాకుళం అర్బన్ : ప్రతిజ్ఞ చేయిస్తున్న డిఇఒ


లావేరు : సచివాలయం వద్ద శ్రమదానం చేస్తున్న సుజాత

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

పరిసరాల పరిశుభ్రతకు ప్రతిఒక్కరూ అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే గొండు శంకర్ పిలుపునిచ్చారు. కల్లేపల్లి సంప్రదాయ గురుకులంలో శనివారం స్వచ్ఛఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడుతూ భారతీయ కళలకు, సంస్కృతులకు నెలవుగా నిలుస్తున్న సంప్రదాయ గురుకులం మరింత అభివృద్ధి చెందాలన్నారు. గురుకులంలో మొక్కలు నాటారు. అనంతరం స్వచ్ఛ దివస్ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు.

కలెక్టరేట్‌లో...

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం అందరి భాద్యతని డిఎస్ఒ సూర్య ప్రకాష్ అన్నారు. స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్‌లో డిఎస్ఒ కార్యాలయంలో డిఎస్ఒ ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమం నిర్వహించారు. సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ప్రతిఒక్కరూ తమవంతు బాధ్యతగా స్వచ్ఛ్ ఆంధ్ర వైపు అడుగులు వేయాలన్నారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, తదితరులున్నారు.

తెలుగువారి కాలనీలో..

నగరపాలక సంస్థ ఆధ్వర్యాన తెలుగు ముసలయ్య కాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ ప్రసాదరావు, అధికారులు పాల్గొన్నారు.

లావేరు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని టిడిపి రాష్ట్ర మహిళా కార్యదర్శి ముప్పిడి సుజాత అన్నారు. శనివారం మండలంలోని తాళ్ళవలసలో స్వచ్ఛఆంధ్ర-స్వచ్ఛ దివాస్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలోని సచివాలయం సమీపంలో శ్రమదానం చేసి పిచ్చిమొక్కలు, చెత్తను తొలగించారు. అలాగే గుమ్మడాం సచివాలయం వద్ద పిచ్చి మొక్కలు తొలగించి శ్రమదానం చేపట్టారు. కార్యక్రమంలో కార్యదర్శి కెళ్ళ రామకృష్ణ, టిడిపి నాయకులు మజ్జి రామూర్తి, జి.భువన, మీసాల రామసత్యం, సూర్యారావు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

బూర్జ: మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలతో పాటు మండలంలోని అన్ని పంచాయతీల్లోనూ స్వచ్ఛఆంధ్రా-స్వచ్ఛదివాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ తిరుపతిరావు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యాలయ ఆవరణలో పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. జెడ్‌పిటిసి బి.రామారావు, విజయలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎస్.తవిటినాయుడు, ఎన్ఎస్ఎస్ పిఒ ఠాగూర్ ఆద్వర్యంలో కళాశాల పరిసరాలను పరిశుభ్రం చేశారు. సచివాలయం పరిధిలో నిర్వహించిన పరిశుభ్రత కార్యక్రమంలో కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

మెళియాపుట్టి : స్వచ్ఛ ఆంధ్రా లక్ష్యంలో భాగస్వాములు కావాలని పలాస వ్యవసాయ శాఖ ఎడి లింగాల మధుబాబు అన్నారు. మండలంలోని మెళియాపుట్టి, చాపర ప్రభుత్వ కార్యాలయాల్లో స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అవగాహనా ర్యాలీ నిర్వహించారు. తహశీల్దార్ బడే పాపారావు, ఎంపిడిఒ నరసింహప్రసాద్ పండా, ఎంఇఒ ఎస్.దేవేంద్రరావు, ఇఒపి ఆర్‌డి రాజేశ్వరి, వైద్యాధికారి పావని, ఎపిఒ రవి పాల్గొన్నారు.

మందస : స్వచ్ఛ దివస్‌లో భాగంగా మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో పిచ్చి మొక్కలను తొలగించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సూర్యానారాయణ, టిడిపి రాష్ట్ర వాణిజ్య విభాగం అధ్యక్షులు జి.కె.నాయడు, కాళింగ కార్పొరేషన్ డైరెక్టర్ బావన దుర్యోదన, జిల్లా అధికార ప్రతినిధి దాసరి తాతారావు, మండల పరిషత్ పరిపాలన అధికారి రుషేశ్వరరావు, ఎం నాగరాజు, ఎపిఎం హరికృష్ణ, పంచాయతీ ఇఒ నవీన్ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం పురపాలక సంఘంలో కమిషనర్ రమేష్ స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో జాతీయ సేవ పథకం పిఒ ఎస్.రజానికుమారి ఆధ్వర్యాన ఆవరణలో మొక్కలను తొలగించి శుభ్రం చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు ప్రియ, సుధాకర్, కె.జగదీష్ పాల్గొన్నారు.

టెక్కలి : ఆర్‌టిసి డిపో ఆవరణలో స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మేనేజర్ ఎస్.శ్రీనివాసరావు, అసిస్టెంట్ మేనేజర్ బి.ఎస్.ఎన్.మూర్తి, మెకానికల్ విభాగం అధికారి రామారావు, బి.విశ్వనాథం, రమేష్, గజివిల్లి నాగభూషణం పాల్గొన్నారు. అదేవిధంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ తెంబూరు గోవిందమ్మ అధ్యక్షతన పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బేపల సతీష్‌కుమార్, జాతీయ సేవా పథకం పిఒ వి.లూక్‌పాల్ పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కె.ఫణీంద్రకుమార్, స్థానిక పశువైద్య ఉప సంచాలకులు ఎం.లోకనాథం, ఎపిఒ హరిప్రసాద్, టిసి రాంబాబు పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : పరిసరాలు పరిశుభ్రంగా ఉంచితే ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి అన్నారు. స్థానిక పాత జిల్లా ఆస్పత్రి ఆవరణలో స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ చింతాడ లక్ష్మీబాయి, ప్రసాదరావు, కార్యదర్శి కె.వివి.జగ్గనథరావు, మండల పార్టీ అధ్యక్షుడు బగాది శేషగిరిరావు, మండల మహిళా అధ్యక్షులు మెండ దమయంతి, పట్టణ అధ్యక్షుడు కోల లవకుమార్, ప్రఫ్లల్‌కుమార్ పాల్గొన్నారు.

సరుబుజ్జిలి : సరుబుజ్జిలి జూనియర్ కళాశాలలో స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం అధ్యాపకులు, విద్యార్థులు ప్రతిజ్ఞ చేయించారు. నాగేంద్ర, రమేష్ సాహు, గౌత మీవీణ, సంగీత, జూనియర్ అసిస్టెంట్ రేవంత్ పాల్గొన్నారు.

కొత్తూరు : స్వచ్ఛ దివస్‌లో భాగంగా వైస్ ఎంపిపి లోతుగడ్డ తులసీవరప్రసాదరావు ఆధ్వర్యాన పరిషత్ పరిషత్, తహశీల్దార్ కార్యాలయాల చుట్టూ పిచ్చి మొక్కలను తొలగించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శైలజ, సిబ్బంది పాల్గొన్నారు.


శ్రీకాకుళం అర్బన్ : ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్


వజ్రపుకొత్తూరు : పరిశీలిస్తున్న జెడ్‌పి సిఇఒ శ్రీధర్‌రాజు



బూర్జ : పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న నాయకులు

పలాస : పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఆర్‌డిఒ వెంకటేష్, కమిషనర్ ఎన్.రామారావులు స్వచ్ఛ దివస్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సచివాలయాల, మున్సిపల్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు. బొడ్డడపాడు, రెంటికోట ప్రాథమిక ఆరోగ్యంలో స్వచ్ఛ దివస్‌ను నిర్వహించారు.

మందస : మందసలో వెలుగు ఐటిడిఎ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు మహిళా సంఘ సభ్యులకు స్వచ్ఛ దివస్‌లో భాగంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో క్లస్టర్ కో-ఆర్డినేటర్ కిషోర్, విఒఎ నాగమణి పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : మండలంలో గోవిందపురం, పెద్దమురహరిపురం, దేవునల్తాడ, పాతటెక్కలి గ్రామాల్లో చేపట్టిన స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని జెడ్‌పి సిఇఒ ఎన్.శ్రీధర్‌రాజు పరిశీలించారు. తాగునీటి పథకాలను, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను, పారిశుధ్య పనులను చేపట్టి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎన్.రమేష్‌నాయుడు, ఇఒపిఆర్‌డి డి.తిరుమలరావు, కార్యదర్శులు త్రినాథ్‌రెడ్డి, కె.కామరాజు, సిహెచ్.మధు పాల్గొన్నారు.

జగన్నాథ మిశ్రా ఆశయాలను కొనసాగిస్తాం

పర్లాకిమిడి: సిపిఎం ఒడిశా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జగన్నాథ మిశ్రా ఆశయాలను కొనసాగిద్దామని జిల్లా కార్యదర్శి ముచ్చి బంగారయ్య అన్నారు. గజపతి జిల్లా పర్లాకిమిడిలో జగన్నాథ మిశ్ర సంతాప సభను శనివారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగన్నాథ మిశ్ర తన తుది శ్వాస విడిచే వరకు సమస్యలపై పోరాటం చేశారని అన్నారు. గొప్ప నిరాడంబరుడని అన్నారు. సిపిఎం నాయకులు దొండపాణి రైతో, కొండింగి సంజీవ్, సిమెంద్ర సబర్, మొహితో మిషాల్, ప్రజాసంఘాల నాయకులు శ్రీను బెహరా, పైల మురళి, సునీల్ పట్నాయక్ పాల్గొన్నారు.

గాయపడిన మహిళ మృతి

బూర్జ: ఇటీవల సీతంపేట సమీపంలోని జరిగిన ఆటో ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి చెందినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. ఈ మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చిన్న కురంపేటకు చెందిన బొడ్డు యశోదమ్మ (59) ముక్కనుమ రోజు కుటుంబ సభ్యులతో కలిసి సీతంపేటలోని అడలి వ్యూ పాయింట్ చూసేందుకు ఆటోలో వెళ్లారు. సరదాగా గడిపి స్వగ్రామానికి తిరిగి ఆటోలో వస్తుండగా అడలి వ్యూ పాయింట్ సమీపంలో ఆటో బోల్తా పడింది. ఆటోలో ఉన్న పెద్దకుమార్తె వెంకటలక్ష్మి, చిన్న కుమార్తెతో పాటు అల్లుళ్ళ చిరంజీవి, వెంకట అప్పారావు, మనవులు కూడా గాయపడ్డారు. చికిత్సకోసం శ్రీకాకుళం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన యశోదమ్మ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందింది.


బాటరీని అందజేస్తున్న విద్యార్థులు

విద్యార్థుల ఔదార్యం

టెక్కలి : మండలంలోని తలగాం ఎట్ నౌపడ ఆర్ఎస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. 2004-25 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు పాఠశాలకు ఇన్వర్టర్ బ్యాటరీని శనివారం ప్రధానోపాధ్యాయులు కృష్ణారావుకు అందజేశారు. పాఠశాల పూర్వ విద్యార్థుల సహకారం ఆదర్శమన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పేడాడ చంద్రశేఖర ఆజాద్, భగత్‌సింగ్, వేడాడ గోపీ, లక్ష్మణ దివ్య, సంతు ఉపాధ్యాయులు రమేష్‌కుమార్, విద్యావతి పాల్గొన్నారు.

కూలిన మర్రిచెట్టు కొమ్మ

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలం బెపల్లి- బాతుపురం గ్రామాల మధ్య ఆర్అండిబి రోడ్డుపై బారీ మర్రిచెట్టు కొమ్మ రోడ్డుపై కూలింది. ఆ సమయంలో ఎవ్వరు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. శనివారం మధ్యాహ్నం సమయంలో చెట్టు కొమ్మ కూలిన శబ్ధం రావడంతో చుట్టూ పక్కల తోటల్లో ఉన్న ప్రజలు పరుగున వచ్చి పరిశీలించారు. విద్యుత్ వైర్లు కింద పడడంతో స్థానికులు సంబంధిత అధికారులకు సమాచారం అందజేశారు. వెంటనే విద్యుత్ సరఫరాను నిలుపుదల చేశారు. సాధారనంగా బాటచారులు మర్రిచెట్టు కింద సేదతీరుతుంటారు. కొమ్మ కూలిన


కూలిన మర్రిచెట్టు కొమ్మ

సమయంలో ఎవ్వరూ లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. రోడ్డుకు అడ్డంగా చెట్టు కొమ్మ పడిపోవడంతో రెండు గంటలు వాహనాలు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. స్థానికులు స్పందించి రోడ్డుపై ఉన్న కొమ్మలు తొలగించడంతో రాకపోకలు పురుద్ధరించారు.

ఎన్నాళ్లీ దీక్షలు?

ప్రజాశక్తి- కవిటి



దీక్షలో పాల్గొన్న బల్లిపుట్టుగ గ్రామస్తులు

తమ మనుగడ, తమ బిడ్డల భవిష్యత్ కోసం ఇంకెన్నాళ్లు తాము దీక్షలు చేయాలని బెంతు ఒరియాలు ప్రశ్నిస్తున్నారు. తమ సమస్యల పరిష్కారానికి బెంతు ఒరియాలు చేస్తున్న రిలే నిరాహారదీక్షలు 388వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా శనివారం దీక్షలో పాల్గొన్న బల్లిపుట్టుగ గ్రామస్తులు మాట్లాడుతూ అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. తరగతి ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో తమ బిడ్డల భవిష్యత్ అగమ్యగోచరంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ శిబిరంలో ల్యారి తరగతుల సంఘం అధ్యక్షుడు చింతామణి బెహరా, అగ్నికుల క్షత్రియ సంఘం నాయకులు దున్న శ్రీను, పుచ్చ ధనరాజు తదితరులు పాల్గొని తమ సంఘీభావం తెలిపారు.

హాట్ బాక్స్ వితరణ

పలాస: మండలంలోని బొడ్డపాడుకు చెందిన గేదెల అప్పారావు ఇటీవల మృతి చెందారు. ఆయన జ్ఞాపకార్థం రూ.20 వేలు విలువ చేసే హాట్ బాక్స్‌ను అగ్నికుల క్షత్రియ సంఘానికి విరాళంగా శనివారం అందజేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ గేదెల అప్పారావు బొడ్డపాడుకు సుదీర్ఘ కాలం సమాజ సేవలందించారని అన్నారు. ఆయనను యువత ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఆయన ఒక కళాకారుడిగా 'అత్తా అల్లుడు' పగటి వేషంలో తన పాత్ర కీలకంగా నిలిచేదన్నారు. కార్యక్రమంలో అగ్నికుల క్షత్రియ సంఘం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.